భారతంలో ప్రేమ కథల వంశోద్ధారకులు

ముక్తేవి లక్ష్మణరావు
డా॥ముక్తేవి భారతి

[క్రిందటి సంచిక తరువాయి]

దేవయాని దుఃఖంతో, కోపంతో తండ్రి దగ్గర కెళ్ళటం చూసి గజగజలాడిపోయాడు యయాతి. ప్రశాంతంగా, ఆనందంగా గడుస్తున్న తన జీవితం ఒక్కసారి అల్లకల్లోలమైందని పరితపించాడు.

దేవయాని పట్ల అనంతమైన ప్రేమ ఉంది యయాతికి. ఆమె సౌందర్యాతిశయం, ఆమె నమయన్మూర్తి అతణ్ణి అనురాగబద్ధుణ్ణి చేశాయి. మూర్తీభవించిన స్త్రీత్వంతో నిత్య యౌవనవతిగా భాసిస్తూ, యయాతిని నిత్యయౌవనుడుగా చేసిందామె.

శర్మిష్ఠతో తన సాంగత్యం కేవలం తన జీవితాన్ని మరింత సుఖమయం చేసింది కానీ, తన జీవితాన్ని నఫలీకృతం చేయదని యయాతికి పూర్తిగా తెలుసు.

దేవయాని లేని తన జీవితం దుర్భరం, అంధకారమయం - ఈ తలపులు యయాతిని మరింత కలవరపెట్టాయి.

తన మనసులోని మాట, జరిగిన సత్యం చెపితే దేవయాని సహించదు. అంతేకాదు, శుక్రాచార్యుల వారంటే తనకి ఎడతెగని గౌరవాలే కాక భయం కూడా ఉంది. ఆయన పెట్టిన ఆంక్షను తను అతిక్రమించాడు. శుక్రుడికి కుమార్తె అంటే ఎంత ప్రేమ ఉందో తనకి తెలియంది కాదు. యయాతికి ఆ నిముషం మరీ భయం కలిగింది. ఆందోళనతో దేవయానిని బ్రతిమాలాలని, శుక్రాచార్యునికి విషయం విన్నవించుకుందామని వేగంగా శుక్రుణ్ణి సమీపించి, నమస్కరించాడు యయాతి.

కానీ అప్పటికే జరగాల్సింది జరిగిపోయింది. దేవయాని గద్గదకంఠంతో తన భర్త చేసిన అన్యాయాన్ని తండ్రికి చెప్పుకుంది. యయాతి నోరు విప్పేందుకు అవకాశమియ్యలేదు.

మహాగ్రుడయ్యాడు శుక్రాచార్యుడు. యయాతి నా ఆంక్షనే ధిక్కరించాడా? ఇంత అహంకారమా? సర్వ శాస్త్రవేత్త, శాంతమూర్తి అయిన శుక్రుడు క్షణంలో రుద్రుడయ్యాడు. నయనాలు అగ్నిశిఖలై ప్రజ్వరిల్లాయి.

"నా ఆంక్ష తిరస్కరించావు. నిన్ను కోరి వరించిన నా కుమార్తెను అవమానించావు. రూప యౌవన మదాంధకారంతో నా కుమార్తెకే అన్యాయం చేశావు కనక, ఆ రూప యౌవనాలే నీకు ఇక దూరమవుతాయి! జరాభార పీడితుడవై జీవితమంతా గడుపు!" అని శపించాడు.

శుక్రుడి శాపం అక్కడి కక్కడే ప్రభావం చూపింది. దేవయాని చూస్తుండగానే, రూప యౌవనాలతో అందర్నీ ఆకర్షించిన యయాతిని వృద్ధాప్యం ఆక్రమించుకుంది. ఆ రూపం చూడలేక దేవయాని కళ్ళు మూసుకుంది. ఏ సౌందర్యమూర్తిని చూసి తను మోహించిందో అతని రూపమా ఇది! నిట్టూర్చింది దేవయాని.

శుక్రుడు దేవయానిని తిలకించాడు. ఆమె దీనవదనం అతని మనసుకి బాధ కలిగించింది. తన పుత్రికపైన ప్రేమ కొద్దీ తనిచ్చిన శాపం, ఆమెకు అవేదన కలిగిస్తోందే!

యయాతి వంక చూశాడు శుక్రుడు. వృద్ధాప్యంతో ముడతలు తేరిన శరీరం, వణుకుతున్న శిరస్సు, పటుత్వం తప్పిన అవయవాలు - ఈ వృద్ధ రూపం పొందిన యయాతితోనా తన కూతురు జీవితమంతా గడపవలసింది? తన కుమార్తెకు తను ఏం న్యాయం చేసినట్టు? కుమార్తె భవిష్యజ్జీవితాన్ని గురించి పరిపరివిధాల తలపోస్తుంటే, నవినయంగా మనవి చేసుకున్నాడు యయాతి.

"ఆచార్యా! నేను దోషినని, మీ ఆజ్ఞను అతిక్రమించానని మీరంటే తల వంచుతాను. మీరు విధించిన శిక్ష అనుభవిస్తాను. కానీ నాది ఒక్క మాట. తమరు పెట్టిన నియమం ఏ విపత్కర పరిస్థితుల్లో దాటవలసి వచ్చిందో మీరు వింటే మీరు నన్ను క్షమించగలరు. తమకు అత్యంత అభిమానురాలై, పుత్రికా సమానురాలైన శర్మిష్ఠ ఋతుమతియై, సంతానార్థం నన్ను ప్రార్థిస్తే నేను ఆమె మనోరథం తీర్చాను. ఋతుమతియైన స్త్రీ సంతానార్థం పురుషుని వేడుకున్నపుడు, ఆ కోరిక తిరస్కరిస్తే అది భ్రూణహత్యాపాతక మవుతుందని శాస్త్రం ఉద్బోధించటం లేదా? కేవలం భోగలాలసుడినై మీ ఆంక్షను అతిక్రమించలేదు ఆచార్యా! ఆ విపరీత పరిస్థితులు నన్ను....." తరువాత యయాతి ఏమన్నాడో శుక్రుడు వినిపించుకోలేదు.

యయాతి మాటల్లో కొంత నిజం ఉందని శుక్రుడి మనసుకి అనిపించింది. అయినా తన ఆజ్ఞను లక్ష్యం చేయనందుకు శిక్ష అనుభవించాలి - తప్పదు!

శుక్రాచార్యుడి మనసు కొంత కరిగిందని గ్రహించినా, వారి మనసు పూర్తిగా మారలేదని తెలుసుకున్నాడు యయాతి. తన మనసులోని మాట సిగ్గు విడిచి చెప్పక తప్పదనిపించింది.

"అయ్యా! దేవయాని అంటే నా కున్న ప్రేమకు అవధులు లేవు. విషయోపభోగ వాంఛలల్లో నా కింకా తృప్తి తీరలేదు. దేవయానితో భోగమయ జీవితం గడపాలనే కోరిక నాకు ఇంకా ఉండగా, ఈ వృద్ధాప్యం రావడం నేను భరించలేను. దయతో శాపావశమన మార్గాన్ని సెలవియ్యండి." చేతులు జోడించాడు యయాతి వినమ్రుడై.

యయాతి మాటల్లోని సత్యాసత్యాలు పరిశీలిస్తూ, దేవయాని వంక తిరిగాడు శుక్రాచార్యుడు.

ఆమె ముఖంలో దైన్యమే కాదు, యయాతిపైన నేరారోపణ చేశానన్న పశ్చాత్తాపం కూడా ప్రస్ఫుటంగా కనిపించింది.

యయాతిని శపించి, తన ధర్మం నిర్వర్తించానని అనుకున్నాడు కానీ, అది తన కుమార్తెకు పరోక్షంగా శాపమే అవుతుందని అనుకోని శుక్రాచార్యుడు కొద్ది సేపు పరితపించాడు. దీనికి మార్గాంతర మాలోచించాలని నిశ్చయించుకున్నాడు.

యయాతి వంక తిరిగాడు.

"నీ విన్నపం అంగీకరించాను. నీ వృద్ధాప్యం నీ పుత్రులెవరైనా గ్రహిస్తే, వారి యౌవనం నువ్వు స్వీకరించు. నీవు భోగ వాంఛా పరితృప్తుడ వయ్యాక, వారికి తిరిగి వారి యౌవనా న్నిచ్చి నీ వృద్ధాప్యాన్ని నువ్వు గ్రహించు" అన్నాడు.

యయాతి, దేవయాని ఒకరి ముఖా లొకరు చూసుకున్నారు.

"ఎవడు నీ వృద్ధాప్యం స్వీకరిస్తాడో, అతడే నీ రాజ్యార్హుడు, అతడే నీ వంశోద్ధారకుడు!"

శుక్రుడి మాట వన్నీటి జల్లు అయింది యయాతికీ, దేవయానికీ.

"నీ వృద్ధాప్యం తీసుకుని, అతని యౌవనాన్ని నీ కిస్తేనే." శుక్రుని గొంతు ప్రతిధ్వనించింది.

దేవయాని ఉలిక్కిపడింది.

పాదాభివందనం చేసి యయాతీ, దేవయానీ ప్రయాణమయ్యారు.

దైవ వశాన వచ్చిన వృద్ధాప్యాన్ని అనుభవించ వచ్చు కానీ, రాజ్యం కోసం, తండ్రి భోగమయ జీవితం కోసం వృద్ధాప్యం కోరుకునే అవివేకు లెవ రుంటారు? దేవయాని కొడుకులు, శర్మిష్ఠ ఇద్దరు కొడుకులు కూడా తల్లిదండ్రుల కోరికను నిర్మొహమాటంగా తిరస్కరించారు.

తల్లితండ్రుల కోసం త్యాగం చేయడానికి ముందుకొచ్చే కుమారులే లేరా? దేవయానికి, యయాతికి నిరాశ ఎదురైంది.

అంతలో ఆశా జ్యోతిలా తల్లిదండ్రుల ముందు నిలిచాడు శర్మిష్ఠ చివరి కొడుకు.

"మీ అభీష్టాన్ని నెరవేర్చటమే నా కర్తవ్యం. మీ వృద్ధాప్యాన్ని స్వీకరించి, నా యౌవనాన్ని వెంటనే మీకు సమర్పిస్తాను. ఈ విధంగా నా తల్లితండ్రులకు సేవ చేసే భాగ్యం కలిగినందుకు ధన్యుణ్ణి" అంటూ పాదాభివందనం చేశాడు.

అతనే యయాతి తరువాత రాజ్యాభిషిక్తుడైన వాడు, వంశోద్ధారకుడైన వాడు, త్యాగ మూర్తి - పూరుడు!

యయాతిని వృద్ధాప్యం వదిలి పోతుంటే, యౌవనం నిశ్శబ్దంగా యయాతిని ఆక్రమించుకుంటుంటే, సజల నయనాలతో తిలకించింది దేవయాని.

[సమాప్తం]